నిజామాబాద్ మంగళవారం 4 జూన్ 2024
TUESDAY, JUNE 4, 2024



# ప్రయాణికుల పాట్లు

బాసర బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

● సమయానికి బస్సులు రాక.. అధికంగా నడువక అవస్థలు ● బాసర అమ్మవారి భక్తులకు తప్పని నిరీక్షణ

*రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణం కల్పించింది. అధికారుల నిర్లక్ష్యంతో సమయానికి బస్సులు రాక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బాసర సరస్వతీ అమ్మవారి చెంతకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిజామాబాద్ నుంచి బాసరకు, బాసర నుంచి నిజామాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ప్రధానంగా అవస్థలు పడుతున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చి గంటలపాటు క్యూలైన్‌లలో వేచి ఉండి, అనంతరం బస్సుల కోసం బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులు సరైన సమయానికి వచ్చేలా, అధిక బస్సులను వదలాలని ప్రయాణికులు కోరుతున్నారు.* - బాసర, జూన్ 3

# అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఉట్నూర్ రూరల్, జూన్ 3: అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాథోడ్ గణేశ్ హెచ్చరించారు. సోమవారం శ్యాంపూర్ గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టరు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టరులో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని యజమానులకు సూచించారు. రైతులకు కనపడే విధంగా విత్తనాల స్టాక్ వివరాలు, ధరలు రోజువారిగా నోటీసు బోర్డుపై రాయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వినయ్ కుమార్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్ : స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏవో రాథోడ్ గణేశ్

తాంసి(తలమడుగు), జూన్ 3: తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో పలు విత్తనాలు, ఫర్టిలైజర్ షాపులను తహసీల్దార్ రాజ్‌మోహన్, మండల వ్యవసాయాధికారి మహేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ రైతులు విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఆర్‌సీహెచ్ 659 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.



తాంసి: మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌మోహన్, ఏవో మహేందర్

## ఆదర్శ పాఠశాలకు నలుగురు విద్యార్థులు ఎంపిక

బోథ్, జూన్ 3 : బోథ్ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి సోనాల ఎంపీపీఎస్ విద్యార్థులు డీ బహుబలి, బీ నవ్యశ్రీ, బీ సాత్విక, నిఖిల్ ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## నేడు మద్యం దుకాణాలు బంద్

ఎదులాపురం, జూన్ 3 : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం మద్యం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్లు మూసి వేయాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసిట్లు తెలిపారు.

## 24 వరకు పశువుల సంత బంద్

భైంసా, జూన్ 3: బక్రీద్ పండుగను పురస్కరించుకుని నేటి నుంచి 24వ తేదీ వరకు పశువుల సంత బంద్ ఉంటుందని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, కొనుగోలు దారులు, అమ్మకం దారులు గమనించి సహకరించాలని కోరారు.

## యువకుడి ఆత్మహత్య

ఖానాపూర్ రూరల్, జూన్ 3 : ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన చిప్ప సతీశ్(35) అదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖానాపూర్ ఎస్ఐ లింబాద్రి వివరాల ప్రకారం.. చిప్ప సతీశ్ జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో ఇంట్లో ఉన్న దూలానికి నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి భీమన్న గతంలో మరణించగా తల్లి చిప్ప వెంకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# పల్లెపాలన అస్తవ్యస్తం..!

● పంచాయతీలకు చుట్టపు చూపుగా ప్రత్యేకాధికారులు
● గ్రామాల్లో రాజ్యమేలుతున్న సమస్యలు
● పట్టించుకోని ఉన్నతాధికారులు



నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నార్నూర్, జూన్ 3 : గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. మండల స్థాయిలో ప్రత్యేకాధికారులు నియమితులయ్యారు. వీరు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ నిత్యం గ్రామాలను సందర్శించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల ఉన్నాయి. కానీ గ్రామ పంచాయతీలకు నియమితులైన ప్రత్యేకాధికారులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం కారణంగా వారు గ్రామ పంచాయతీలకు చుట్టపు చూపుగా వస్తున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 46 ప్రకారం ప్రతి రెండు నెలలకొకసారి పంచాయతీలో గ్రామ సభలను నిర్వహించి వాటిలో గ్రామ ప్రజలను భాగస్వామ్యం చేస్తూ గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకోవడం ప్రజా సమస్యలపై గతంలో జీపీలో చేసిన పనులపై చర్చిస్తుంటారు. ప్రస్తుతం సాగుతున్న ప్రత్యేక పాలనలో గ్రామసభలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల వాదన మాత్రం మరోలా ఉంది. ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఎస్ఎఫ్‌సీ నిధులు రాకపోవడంతో పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ము అంతంత మాత్రంగానే ఉండడంతో తాగునీరు, పారిశుధ్యం వంటి పనులు తాము సొంతంగా ఖర్చు చేసినట్లు పేర్కొంటున్నారు. కేవలం 15వ ఆర్థిక జనాభా దామాషా ప్రకారం విడుదలవుతున్నాయని, కానీ అవి ట్రాక్టర్ కిస్తీలు, డీజిల్, కార్మికుల వేతనాలకే సరిపోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. దీంతో పంచాయతీల నిర్వహణ తమకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక తాము ఖర్చు చేసిన డబ్బులు తిరిగి రాక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుపుతున్నారు.

### స్పెషల్ ఆఫీసర్ల పాలనలో అవస్థలు...

స్పెషల్ ఆఫీసర్లు మండల స్థాయి అధికారులు కావడంతో వారు తమ సొంత కార్యాలయాల్లోని పనులకు పరిమితమవడం, మొన్నటి వరకు పార్లమెంట్ ఎన్నికల బిజీగా ఉండడం ఇలా అనేక కారణాలను సాకుగా చూపుతూ పంచాయతీలకు హాజరుకావడం లేదు. దీంతో కార్యదర్శులపై అజమాయిషీ లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో పాటు సమయపాలన పాటించడం లేదని, తమ సమస్యలను సైతం పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామ ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. మల్టీపర్పస్ వర్కర్స్‌కు సైతం సక్రమంగా వేతనాలు అందించక పోవడంతో వారు పారిశుధ్య పనులు చేసేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. గత సర్పంచ్‌ల కాలంలో పారిశుధ్య కార్మికుల వేతనాల విడుదల ఆలస్యమైనప్పుడు సర్పంచ్‌లు సొంత నిధులు వెచ్చించి పనులు చేయించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి పంచాయతీల పాలనను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజురా సత్యం

ఖానాపూర్, జూన్ 3: ఖానాపూర్‌లోని గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అన్నారు. గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇటీవల ఉద్యోగార్థులు చైర్మన్‌ను కలిసి విన్నవించారు. దీంతో సోమవారం శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించి ఉద్యోగార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు పారిశుధ్య పనులు చేపడుతామన్నారు.

## మున్సిపల్ అధికారుల ముందస్తు చర్యలు



జేసీబీతో పారిశుధ్య పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్ అర్బన్, జూన్ 3 : నిర్మల్‌లోని పలు వార్డుల్లోని ప్రధాన మురుగు నీటి నాళాలను సోమవారం మున్సిపల్ సిబ్బంది జేసీబీ సహాయంతో శుభ్రం చేశారు. వానకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మురుగు, వర్షం నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపుడెక్క, ముళ్లపొదలు, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. కాలువలు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, పడవేయవద్దని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటో సిబ్బందికి అందించాలని కమిషనర్ రాజు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

భీంపూర్, జూన్ 3 : ఆదిలాబాద్ డిపో నుంచి భీంపూర్ మండలం కరంజి(టీ) వరకు సోమవారం ఉదయం బయలు దేరిన ఆర్టీసీ బస్సు ఇందూర్‌పల్లి సమీపన అదుపుతప్పి రోడ్డు పక్కకు గోతిలో కూరుకుపోయింది. గుంతలను తప్పించబోయిన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బస్సు రోడ్డు పక్కకు గోతిలో కూరుకుపోయింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 48 మందికి పెను ప్రమాదం తప్పింది.



రోడ్డు పక్కకు గోతిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

## అందుబాటులో 7.01 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

ఎదులాపురం, జూన్ 3 : ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లో 341 మంది డీలర్ల వద్ద 7,01,457 విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని విత్తన దుకాణాల్లో అన్ని రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలను లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాకెట్, బిల్లు భద్రపర్చుకోవాలని తెలిపారు.

## పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నిర్మల్ అర్బన్, జూన్ 3 : నిర్మల్‌లోని సోమవార్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నిర్మల్‌లో ఒకేఒక పరీక్షా కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. తొలిరోజు తెలుగు పరీక్షకు మొత్తం 62 మంది విద్యార్థులకు 43 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ తనిఖీ చేశారు.

బోథ్, జూన్ 3 : బోథ్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పాత తాలుకా పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన పదిలో తప్పిన విద్యార్థులకు ఇక్కడ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 73 మంది విద్యార్థులకు 60 మంది హాజరుకాగా 13 మంది గైర్హాజరయ్యారు. కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా ఇదపు పోశెట్టి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా కుమ్మరి పోశెట్టి వ్యవహరించారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈవో భూమారెడ్డి తనిఖీ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-327729-All

CHANGE OF NAME

★ I,SHELKE PALLAVI MADHAV D/O SHELKE MADHAV, H.No.1-19, Vil:Kupti Tanoor,Nirmal, Now Changed my name as WAGMARE PALLAVI W/O SAHEBRAO NTZ-324884

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

# బాధిత కుటుంబాలకు పరామర్శ



నేరడిగొండ: బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 3 : నేరడిగొండ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ కమల్‌సింగ్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు సాబ్లె నానక్‌సింగ్, డాక్టర్ స్వామి, ధన్‌రాజ్, రవీందర్ ఉన్నారు.

భైంసాటౌన్, జూన్ 3: తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కత్తి సంతోష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ రజాక్, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి, జూన్ 3: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జన్నావార్ కిశోర్ ఇటీవల ఆస్ట్రేలియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ నగేశ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కిశోర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వ్యాపారస్తులు సంతోష్ చింతవార్, దీపక్ చింతావార్, నాయకులు మెస్రం తుకారాం, కనక తుకారాం, హన్మంత్‌రావ్ ఉన్నారు.

కుంటాల, జూన్ 3: మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకుడు నాలం శ్రీనివాస్ తల్లి భోజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ సోమవారం కుంటాల మండలం ఓలాలో వారి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రాథోడ్ బాపురావ్, జడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మల్లారెడ్డి తదితర నాయకులు కూడా వేర్వేరుగా పరామర్శించారు.



భైంసాటౌన్: పరామర్శిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



కుంటాల: ఓలాలో పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, జూన్ 3 : నిర్మల్ జిల్లా ప్రజలు పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. సోమవారం నిర్మల్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు హాజరయ్యారు. వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను బాధితులు వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు పోలీసులకు సంబంధాలు మెరుగుపరుస్తూ శాంతిభద్రతలను పరిరక్షించడమే ధ్యేయంగా ముందకెళ్తున్నామన్నారు. ఇందుకోసం ప్రతి సోమవారం ప్రజాదివస్ కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలో అనుమానాస్పద వ్యక్తులు కనబడిన, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని దృష్టికి వస్తే వెంటనే 8712659599 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

## చెక్కులు అందజేత



చెక్కులను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

భైంసా, జూన్ 3: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం మరణించిన కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని భైంసా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవిశంకర్ అన్నారు. ఇటీవల సహజ మరణం చెందిన సల్లోల్ల చంద్రకళ, బల్లెపోడ్ గణేశ్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రమేశ్, అసిస్టెంట్ మేనేజర్ బాల్‌సింగ్, సీఎస్పీ ఆపరేటర్ సత్యపోల్ల దత్తాత్రి పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు ..

కుంటాల, జూన్ 3: కుంటాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ఏరియా కోఆర్డినేటర్ రాము సందర్శించారు. విద్యార్థులకు పలు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సక్రపు గజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ రకాల పుస్తకాలతో విద్యార్థులు

## ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

దస్తురాబాద్, జూన్ 3: మున్యాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్న దూస రాజన్న మూడు రోజుల క్రితం మృతి చెందాడు. బాధిత కుటుంబానికి సోమవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి దాతలు 9440977459 ( చంద్రమౌళి) ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందిచాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జైనథ్, జూన్ 3 : మండలంలోని భోరజ్ జాతీయ రహదారి 44 సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన ఇజ్జగిరి ప్రణయ(38) మృతి చెందినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు... ప్రణయ తన తల్లిగారింటికి పెండల్‌వాడలో సత్యనారాయణ స్వామి వ్రతం పూర్తి చేసుకొని తండ్రి టక్కూరి కిష్టుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్‌కు వెళ్తున్నది. భోరజ్ సమీపంలో ఎన్ఎల్‌వో 01ఏ హెచ్4055 నంబర్ గల లారీ (కంటైనర్) ఢిల్లీ నుంచి నెల్లూరు వెళ్ల క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ప్రణయ అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి టక్కురి కిష్టు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కొడుకు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ముథోల్, జూన్ 3: వెంకటాపూర్ గ్రామానికి చెందిన మేత్రి నరేశ్ (38) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. నరేశ్ తన కొత్త ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా భూమిలో పాతిన విద్యుత్ వైర్ గమనించక గడ్డపారతో తవ్వుతుండగా విద్యుత్ వైరు తగలడంతో షాక్ గురై మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## చికిత్స పొందుతూ ..

కుంటాల, జూన్ 3: అందకూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడినటువంటి నిర్మల్‌కు చెందిన బొడ్డు వంశీ హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని కుంటాల ఎస్ఐ రజనీకాంత్ తెలిపారు. మరో క్షతగాత్రుడు నందకిశోర్ పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## లైన్‌మన్‌కు అభినందన

భైంసా, జూన్ 3: భైంసాలోని సబ్ స్టేషన్ కార్యాలయంలో పట్టణ లైన్‌మన్ దస్వంత్ రావుకు ఉత్తమ కార్మిక పురస్కారం రావడంపై సోమవారం ఆయనను పూలమాల శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ ఆదిత్య, ఏఈ మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



దస్వంత్‌రావును సన్మానిస్తున్న అధికారులు

## మహాన్నదానం

ఎదులాపురం, జూన్ 3 : పట్టణంలోని గంగపుత్ర శివాలయంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాత పోతరాజు దేవన్న కుటుంబ సభ్యులు స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్న రాములు, కుమ్మరి కృష్ణ, సభ్యులు , గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, మేకల అశోక్, కౌన్సిలర్ స్వప్న పాల్గొన్నారు.

## 5న కరాటే శిక్షణ ముగింపు

నిర్మల్ అర్బన్, జూన్ 3 : ఝాన్సీ లక్ష్మీబాయి కరాటే శిక్షణ సమితి ఆధ్వర్యంలో మహిళల ఆత్మరక్షణ కోసం మే 24వ తేదీన ప్రారంభమైన వేసవి ఉచిత శిక్షణ శిబిరం ముగింపును బుధవారం నిర్వహిస్తున్నట్లు కరాటే శిక్షకురాలు కిన్నెర్ల మృణాళిని తెలిపారు. పట్టణంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.